క్లుప్తంగా

సూర్యారావుకు సేవా రత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న సూర్యారావు

బోట్‌క్లబ్: కాకినాడకు చెందిన నటుడు, సామాజిక వేత్త తురగా సూర్యారావు సేవారత్న అవార్డు అందుకున్నారు. విజయవాడ మదర్ సర్వీస్ సొసైటీ మూడో వార్సికోత్సవం సందర్భంగా ఆయనకు ఈ అవార్డును సోమవారం అందజేశారు. మదర్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు మల్లాడి ప్రసాదరావు, హీరోయిన్ రంజిత షాండే చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. అవార్డు అందుకున్న సూర్యారావును నగరంలో పలువురు సాహితీ వేత్తలు, నటులు అభినందించారు.

రాజుకు అవార్డు ప్రదానం



సేవారత్న నేషనల్ అవార్డు అందుకుంటున్న రాజు

కరప: గురజానపల్లి గ్రామంలోని మానవత్వం స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలకు గుర్తించి సంస్థ వ్యవస్థాపకుడు జొన్నలగడ్డ రాజును సేవారత్న నేషనల్ అవార్డుతో సత్కరించారు. మదర్ సర్వీస్ సొసైటీ మూడో వార్షికోత్సవం సందర్భంగా విజయవాడ గాంధీనగర్ హనుమంతరావు గ్రంథాలయంలో జరిగిన నేషనల్ అవార్డ్స్ ప్రదానోత్సవం భాగంలో సినీ ప్రముఖులు సీనియర్ ఆర్టిస్ట్–కమెడియన్ పృథ్వీ రాజ్, హీరోయిన్ రంజిత షాండే చేతుల మీదుగా సత్కరించారు.

అలరించిన సంగీత కచేరి



సంగీత కచేరిలో పాడుతున్న కల్పన

బోట్‌క్లబ్: మాదిరెడ్డి సుబ్బారావు జయంతి సందర్భంగా స్థానిక సూర్యకళా మందిరంలో సోమవారం రాత్రి నిర్వహించిన సంగీత కచేరి ప్రేక్షకులను అలరించింది. ప్రముఖ గాయని కల్పన పలు హిట్ చిత్రాల్లోని పాటలను ఆలపించి అందరినీ ఆకట్టుకున్నారు. కల్పనతోపాటు కాకినాడకు చెందిన గాయకుడు రమణ పలు చిత్రాల్లోని పాటలు ఆలపించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కరప: సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి పంపిణీ చేశారు. లబ్ధిదారుల నివాసాలకు వెళ్లి చెక్కులను అందజేశారు. కరప మండలం వేములవాడ గ్రామానికి చెందిన వాసంశెట్టి శ్రీనివాస్ గత ఐదేళ్లుగా క్యాన్సర్‌తో పోరాడుతూ ఇటీవల మరణించారు. ఆ కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ రూ.1,05,000ల చెక్కును అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో ప్రమాదవశాత్తు మరణించిన గుత్తుల సత్యనారాయణ కుటుంబానికి మంజూరైన రూ.2 లక్షల చెక్కును బ్యాంకు అధికారులు తిరస్కరించారు. ఈ విషయం తెలుసుకున్న సీఎం చంద్రబాబు జోక్యంతో, ఆ సహాయం మరోసారి మంజూరైంది. అలాగే, సీనియర్ జర్నలిస్ట్ జీవన్ కుటుంబానికి రూ.2,14,632 చెక్కును అందించారు. అంతేకాకుండా, వినికిడి సమస్యతో బాధపడుతున్న గుత్తుల మంగయ్యమ్మకు రూ. 30,000 విలువైన వినికిడి యంత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బుంగా సింహాద్రి, వాసంశెట్టి బుజ్జి, నాగం బాబులు, వాసంశెట్టి నారాయుడు పాల్గొన్నారు.

బీమా.. ధీమా ఏదీ?

- పంటలకు లభించని భరోసా
- ప్రకృతి విపత్తులు వస్తే పంట నష్ట పరిహారం లేనట్టే
- ప్రీమియం రైతులే చెల్లించుకోవాలన్న ప్రభుత్వం
- అన్నదాతల ఆగ్రహం



కాకినాడ రూరల్‌లో సాగులో ఉన్న ఖరీఫ్ వరిచేలు

కాకినాడ రూరల్: ఆరుగాలం కష్టించి రైతులు పండించే పంటలకు భరోసా లేకుండాపోయింది. ప్రకృతి విపత్తులు తలెత్తి పంటలు దెబ్బతింటే ఆదుకునేందుకు అన్నదాతకు అండగా నిలబడాల్సిన బీమా ప్రశ్నార్థకంగా మారింది. పంటల బీమా ఉంటే వరదలు, విపత్తులు సమయంలో దెబ్బతిన్న చేలు, పంటలకు బీమా ద్వారా పంట నష్ట పరిహారం ఆదుకునే అవకాశం ఉంటుంది. దేశానికి తిండి గింజలు అందించే రైతన్నకు సాగుబడి కష్టమవుతున్న తరుణంలో వేలాది రూపాయలు పెట్టుబడిగా సేద్యంగా కోసం శ్రమను చిందించే అన్నదాతకు రక్షణ లేకుండా పోయింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే దాదాపు రెండు మూడు నెలలు పూర్తయ్యే మూడో నెల జరుగుతుండగా రైతులు ఈ సీజన్‌లో సాగునీరు నుంచి ఎరువులు వరకు అన్నింటా అవస్థలు ఎదుర్కొవల్సి వస్తోంది. అధిక వర్షాలు లేకపోవడంతో రైతులకు ప్రస్తుతానికి ఇబ్బంది లేపోయినా పంట చేతికి వచ్చే సమయంలో మాత్రం ప్రకృతి విపత్తులు రైతుల వెన్ను విరుస్తున్నాయి. విపత్తులు సంభవిస్తే పంట నష్టం నుంచి రైతులను ఆదుకునేందుకు పంటల బీమా రక్షణగా నిలవల్సి ఉంది. కానీ ఈ సీజన్‌లో పంటల బీమా రైతులకు శాపంగా మారింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఈ క్రాప్ పంట నమోదు సమయంలోనే ప్రభుత్వం ఉచితంగా పంటల బీమా అందించేది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రీమియంను రైతులే కట్టుకోవల్సిన దుస్థితి ఏర్పడింది. ఖరీఫ్‌లో వరికి ఎకరాకు రూ.690 రైతులు చెల్లించల్సి ఉంటుంది. ఇది రైతన్నకు భారంగా మారడంతో చాలా మంది వెనకంజ వేస్తున్నారు. పంట రుణాలు తీసుకునే రైతుల వద్ద నుంచి బీమా సొమ్ములను బ్యాంక్ చెల్లిస్తుండగా రుణాలు పొందని చాలా మంది రైతులు బీమా చెల్లించడం లేదు.

కాకినాడ రూరల్‌లో సుమారు 4200 ఎకరాలలో రైతులు ఏటా వరి పండిస్తున్నారు. సుమారు 2750 మంది రైతులు ఉన్నారు. అయితే కేవలం 60 మంది మంది రైతులు మాత్రమే పంటల బీమా సొమ్ములు కట్టారు. ప్రకృతి విపత్తులు సంభవించి పంట నష్టపోతే వీరికే వేలాది రూపాయాలు పెట్టుబడితో పాటు పంటను రైతులు నష్టపోయే దుస్థితి ఏర్పడుతుంది. మరో వైపు కౌలు రైతులకు నేటికి అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం అందలేదు. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలు జారీ చేయకపోవడంతో వారి వివరాలు నమోదు చేయడం లేదు.

రైతులపై నిర్లక్ష్యం



అన్నదాతను ప్రభుత్వాలు ఆదుకోవాలి. వారిని సమస్యల్లోకి నెట్టకూడదు. యూరియా కోసం రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో పంటల బీమా రైతులే చెల్లించుకోవల్సిన దుస్థితి ఏర్పడింది. ఇది మంచి పద్ధతి కాదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ ఉచిత పంటల బీమా అందించారు. రైతులపై భారం లేకుండా రైతులందరికి పంటల బీమా వర్తించేలా ఉచిత బీమాను కూటమి ప్రభుత్వం వర్తింపజేయాలి.

– అరవ దామోదర సూర్య ప్రకాశరావు, రైతు, కొవ్వూరు

60 మందే చెల్లించారు



ఖరీఫ్ వరి చేలకు ప్రీమియంను ఇప్పటికి 60 మంది రైతులకు నమోదు చేశాం. బీమా సొమ్మును రైతులే చెల్లించుకోవల్సి ఉంటుంది. ఎకరాకు రూ.690 చొప్పున కట్టాలి. కాకినాడ రూరల్‌లో యూరియా కొరత లేదు.

– సీహెచ్ సత్యనారాయణ, మండల వ్యవసాయాధికారి, కాకినాడ రూరల్

ఇంజినీర్లకు ఆదర్శం మోక్షగుండం విశ్వేశ్వరయ్య



ఆర్‌అండ్‌బీ సీఈ కంతును సత్కరిస్తున్న వీసీ సీఎస్‌ఆర్‌కే ప్రసాద్



రక్తదానం చేస్తున్న జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంజనీరింగ్‌కు ఆదర్శమూర్తి భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని జేఎన్‌టీయూకే డాక్టర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో సోమవారం ఆయన జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఇంజినీర్ ఆయన సాధించిన ఘనత ద్వారా స్ఫూర్తిపొంది, ఆయన మార్గదర్శకంలో పయనిస్తూ నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా నీటి సరఫరా, మురుగునీటి పారుదల, సాగునీటి వ్యవస్థలకు నమూనాలను రూపకల్పన చేశారని గుర్తు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ మోహనరావు మాట్లాడుతూ ప్రస్తుత ఇంజనీర్స్‌కి, భావితరాలకు స్ఫూర్తిగా ఉండే ఇంజనీర్స్‌డే వేడుకలు నిర్వహించాలని, సాంకేతిక అందుబాటులో లేని రోజుల్లో తెలివితేటలతో ఎన్నో సమస్యలకు సులువుగా పరిష్కార మార్గాలు అందజేశారని తెలిపారు. ఈఫిల్ టవర్ నిర్మించి 107 సంవత్సరాలు దాటుతున్నా నేటికీ ఏమాత్రం చెక్కుచెదర లేదన్నారు. అనంతరం ఆర్‌అండ్‌బీ సీఈ జి.కంతును సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

విశ్వేశ్వరయ్య సేవలు చిరస్మరణీయం

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): దేశంలో అనేక సాగు, తాగు నీటి ప్రాజెక్టుల రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా పేర్కొన్నారు. సోమవారం విశ్వేశ్వరయ్య జయంతి, ఇంజినీర్స్ దినోత్సవ కార్యక్రమం స్థానిక గృహ నిర్మాణ సంస్థ కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేసీ రాహుల్ మీనా, రాష్ట్ర ఇండియన్ రెడ్ క్రాస్ చైర్మన్ వైడీ రామారావు, హౌసింగ్ పీడీ సత్యనారాయణ హాజరై మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఇండియన్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని జేసీ ప్రారంభించి, రక్తదానం చేశారు. సమాజంలో ఇంజినీరింగ్ రంగానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. కుటుంబ పరిస్థితులు అంతగా సహకరించకపోయిన పట్టుదలతో మోక్షగుండం విశ్వేశ్వరయ్య సివిల్ ఇంజినీర్‌గా చదువు పూర్తి చేసి, ఇంజనీరుగా అత్యున్నత శిఖరాలను అధిరోహించారన్నారు. నేటి యువత మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు.

సివిల్ ఇంజినీరుగా ఆయన సేవలు మరువలేనివి

కాకినాడ రూరల్: రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఇంజనీర్లు ప్రముఖ ఎలక్ట్రికల్ విశ్రాంత ఇంజనీర్ అడ్డాల వీరభద్రరావు, వంకా అరుణ రేఖ, ఎంవీఎల్ శాస్త్రి, గట్టి సత్యనారాయణలను సత్కరించారు.

యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న బ్లూ ఓషియన్ బయోటెక్ పరిశ్రమ కార్మికులు

బోట్‌క్లబ్: బ్లూ ఓషియన్ బయోటెక్ పరిశ్రమ మూసివేతను అడ్డుకొని కార్మికుల ఉపాధిని కాపాడాలని కార్మికులు, సీఐటియూ ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్ మాట్లాడుతూ పెద్దాపురం మండలం జి.రాగంపేటలో బ్లూ ఓషియన్ బియోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ గత నాలుగు రోజులుగా మూతబడి 78 మంది కార్మికులను విధుల నుంచి తొలగించారన్నారు. ఈ పరిశ్రమ నమ్ముకుని 12 ఏళ్ల నుంచి పనిచేస్తున్న కార్మికులను ఎటువంటి నోటీసు ఇవ్వకుండా అర్ధాంతరంగా తొలగించడంతో కుటుంబాలతో సహా రోడ్డును పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిశ్రమలో పనిచేసే కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, గుర్తింపు కార్డులు, పే స్లిప్స్, బ్యాంకు అకౌంటుకు వేతనాల చెల్లింపు వంటి కనీస కార్మిక చట్టాలను కూడా అనేక సంవత్సరాల నుంచి అమలుచేయకపోయినా కార్మిక శాఖ, ఫ్యాక్టరీ అధికారులు నిద్రపోతున్నారని విమర్శించారు. గత పదేళ్లలో ఒక్కసారి కూడా పరిశ్రమను కార్మిక అధికారులు తనిఖీ చేయకపోవడంతో యాజమాన్యం ఇష్టానుసారంగా అన్ ఫెయిర్ లేబర్ ప్రాక్టీస్‌కి పాల్పడిందని విమర్శించారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని, కార్మిక చట్టాల ప్రకారం వేతనాలు, బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో జి.లోకేష్, కె.దుర్గాప్రసాద్, ఎ.త్రిమూర్తులు, జె.ఎసత్యనారాయణ, ఎం.సత్యనారాయణ, పి.గోపాలకృష్ణ, సీహెచ్ నాగరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలి

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రవేటీకరణ ఆపాలని జై భీమ్ రావు భారత్ పార్టీ పొలిటికల్ ఎఫైర్స్ చైర్మన్ ఏనుగుపల్లి కృష్ణ డిమాండ్ చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ప్రైవేటీకరణపై ప్రభుత్వం మొండి వైఖరిని నిరసిస్తూ అన్ని రాజకీయ విద్యార్థి యువజన సంఘాల సహకారంతో విజయవాడ ధర్నా చౌక్ వద్ద ఈ నెల 18న జరగబోయే మహా ధర్నాలు జయప్రదం చేయాలని కోరారు. కాకినాడ ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ అగ్రవర్ణ నిరుపేదలకు రాజ్యాంగ పరంగా వచ్చిన రిజర్వేషన్లు తీసి తీసివేయాలని కూటమి ప్రభుత్వం కుట్రలను ప్రజలకు వివరించేందుకు ఈ ధర్నా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ ధర్నాకు ఆంధ్ర మాలమహానాడు తమ సంపూర్ణ మద్దతునిస్తున్నట్టు వ్యవస్థాపక అధ్యక్షులు సిద్ధాంతుల కొండబాబు తెలిపారు. కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా పెట్టుబడిదారులకు కట్టబెడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అడుగుజాడల్లో ఆంధ్ర కూటమీ ప్రభుత్వం నడుస్తున్నదని, ప్రైవేటీకరణకు కోరుకుంటున్నా ఆంధ్ర ప్రభుత్వ చర్యలను ప్రతి ఒక్క విద్యార్థి యువజనులు వ్యతిరేకించాలని కోరారు. దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కోఆర్డినేటర్ టి.చెంగల్ రావు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కపట నాటకాలు ఆడుతున్నదన్నారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నాయకులు గుబ్బల ఆదినారాయణ మూర్తి, భారత కార్మిక సంఘాల సమస్య ఎఫ్‌టీయకులు రాగుల రఘువులు, బహుజన ఆర్మీ జిల్లా అధ్యక్షుడుని సంజయ్ కుమార్ పాల్గొన్నారు.

మా కుమార్తెకు పింఛన్ ఇప్పించండి



పింఛను కోసం కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన మల్లెల దుర్గాదేవి, అప్పారావు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): వయస్సు పెరుగుతున్నా శరీర ఎదుగుదల లేని తమ కుమార్తెకి లక్ష్మీపూర్ణకు విభిన్న ప్రతిభావంతుల పింఛను అందించి ఆదుకోవాలని తల్లిదండ్రులు మల్లెల దుర్గాదేవి, అప్పారావు వేడుకున్నారు. వయసు ఆరున్నరేళ్లు అయినా ఆరు నెలల పాపలా కనిపిస్తుందని, ఏ మందులు వేయించినా ప్రయోజనం లేదని, తమను ఆదుకోవాలని వారు కోరారు. సోమవారం కుమార్తెతో కలిసి కాకినాడలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ కార్యక్రమానికి వచ్చారు. తమది రంగంపేట మండలం దొడ్డిగుంట గ్రామమని బతుకు తెరువు నిమిత్తం కాకినాడలో ఒక అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మేన్‌గా పని చేసేందుకు వలస వచ్చినట్టు చెప్పారు. పింఛన్ నిమిత్తం వివిధ కార్యాలయాలకు తిరిగామని న్యాయం జరగలేదని తమ కుమార్తెకు విభిన్న ప్రతిభావంతుల కోటాలో పింఛన్ అందించాలని కోరారు.

అర్ధరాత్రి అపార్టుమెంట్‌లో మంటలు

కాకినాడ రూరల్: రమణయ్యపేట గ్రామ పరిధిలోని సర్పవరం జంక్షన్‌లో పోలీసు స్టేషన్ ఎదురుగా ఉన్న వీధిలో గోపికృష్ణ రెసిడెన్సీలో దట్టమైన పొగతో కూడిన మంటలు ఆదివారం అర్ధరాత్రి కలకలం రేపాయి. అపార్టుమెంట్‌లో మూడో ఫ్లోర్లో నివాసం ఉంటున్న పిల్లి సత్తిబాబు, అతని కుటుంబం మంటల నుంచి తప్పించుకుని ప్రాణాలతో బయట పడ్డారు. ప్రమాదంలో హాలులోని పర్నిచర్ పూర్తిగా కాలి బూడిదయ్యింది. సత్తిబాబు ఫిర్యాదు మేరకు సర్పవరం ఎస్సై శ్రీనివాస్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితుడు సత్తిబాబు వివరాల ప్రకారం.. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో హాలులో కిటికి నుంచి పెట్రోల్, డీజిల్ బాటిల్స్‌తో వేసి నిప్పు పెట్టారని, పొగ ఎక్కువగా వ్యాపించిందన్నారు. తాను, కుటుంబ సభ్యులు బయటకు వచ్చి స్థానికులు సహాయంతో తప్పించుకున్నామని తెలిపారు. తమ అపార్టుమెంట్ భవనం పెంట హౌస్‌లో ఉండే రవి చంద్రకుమార్‌తో డబ్బుకు సంబంధిత వివాదం ఉండడంతో అతనిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశామన్నారు. ప్రమాదానికి గల కారణాలపై అన్ని కోణాలలో దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఉత్సాహంగా పాఠశాల క్రీడా సమాఖ్య ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటి): పాఠశాల క్రీడాసమాఖ్య అండర్–14, 17 ఆధ్వర్యంలో కాకినాడ డీఎస్ఏలో సోమవారం క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలను జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు పీడీ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శులు కె.శ్రీనివాస్, సుధారాణి మాట్లాడుతూ ఫుట్‌బాల్, రైఫిల్ షూటింగ్, జుడో, సాఫ్ట్‌టెన్నిస్ పోటీల్లో జరిగిన ఎంపికలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో సుమారు 600 మంది హాజరయ్యారన్నారు. ఉదయం సుమారు రెండు గంటల పాటు వర్షం కారణంగా ఫీల్డ్ గేమ్స్ ఎంపికకు అంతరాయం కలిగినా తర్వాత వర్షం తగ్గాక ఎంపికలు కొనసాగించి, జిల్లా జట్లను ఎంపిక చేశాన్నారు. ఈ ఎంపిక పోటీలను ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ మహబూబ్ బాషా పర్యవేక్షించారు. ఎంపికల నిర్వహణలో సీనియర్ పీడీలు జార్జి, పట్టాభి, రవిరాజు, హరిబాబు, మాచరరావు, శ్రీహరి, బచ్చు చంద్రశేఖర్, రవికౌర్, డిఎస్ఏ కోచ్‌లు సమీర్, స్వామి, తేజ, లక్ష్మణ్ సహకారం అందించారు.

ఫుట్‌బాల్ ఎంపికల్లో ప్రతిభకు తిలోదకాలు: డీఎస్ఏలో సోమవారం నిర్వహించిన అండర్–17 ఫుట్‌బాల్ ఎంపికల్లో ప్రతిభను పక్కన పెట్టి ఎంపికలు జరిగాయని కొందరు ఆరోపించారు. ఎంపిక కమిటీ సభ్యులు కూడా ఇతర క్రీడలకు సంబంధించిన వారిని వేశారని, వర్షం కారణంగా కూడా క్రీడాకారులు మైదానంలో ఆడేందుకు ఇబ్బంది పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపికలకు హాజరుకాని వారిని సైతం ఎంపిక చేశారని క్రీడాభివృద్ధి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పాఠశాల క్రీడాసమాఖ్య కార్యదర్శి శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఫుట్‌బాల్ ఎంపికలు పారదర్శకంగానే జరిగాయని, ఎంపిక కమిటీ సభ్యులు గతంలో యూనివర్సిటీ, కళాశాల స్థాయిలో ఫుట్‌బాల్ ఆడిన క్రీడాకారులే అన్నారు. ఎంపికలకు రాని వారిని ఎంపిక చేశారనేది తన దృష్టికి రాలేదని, దీనిపై విచారణ జరిపించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

ఉపాధ్యాయులు సమాజ శిల్పులు



ఉపాధ్యాయులను, సిబ్బందిని సత్కరించిన ఎమ్మెల్యే నానాజీ

కరప: విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా చేసేది ఉపాధ్యాయులేనని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) పేర్కొన్నారు.ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు పొందిన కె.దేవి సునంద కుమారికి కరపలో నిర్వహించిన అభినందన సత్కార సభలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యారంగంలో విశేష కృషి చేసిన పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. ఈ మండల కేంద్రం కరపలోని చంద్రన్న సమావేశ మందిరంలో నిర్వహించిన సత్కార సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం దేవీ సునంద కుమారిని పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు కొప్పుల బుల్లి కృష్ణవేణి, ప్రత్తి సత్యనారాయణ, ఉపాధ్యాయులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శ్రీకృష్ణ జన్మాష్టమి పూజలు

సామర్లకోట: స్థానిక అతిపూరాతన విష్ణు ఆలయమైన మాండవ్యనారాయణ స్వామి ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీ వైష్ణవాష్టమిని పురస్కరించుకొని ప్రతి ఏడాది ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం ఉదయం స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని మాండవ్యనారాయణస్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరణలు చేసి పూజలు చేశారు. ఆలయ పారాయణ కమిటీ మహిళా సభ్యులతోవిష్ణు సహస్ర నామ పారాయణ నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. పారాయణ చేసిన 100 మంది మహిళలకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ఈఓ బిక్కిన వెంకట్రాయచౌదరి ఆధ్వర్యంలో ఆలయ పండితులు అనంత పద్మనాభాచార్యులు, రవికుమార్, రవికుమార్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం సాయంత్రం పట్టణ పరిధిలోని కృష్ణుని ఆలయం వద్ద ఉట్టి కొట్టు కార్యక్రమం ఉంటుందని ఆలయ పండితులు తెలిపారు.

అథ్లెటిక్స్ పోటీల్లో మాధవపట్నం విద్యార్థుల ప్రతిభ



బహుమతులు పొందిన మాధవపట్నం హైస్కూల్ విద్యార్థులతో ఉపాధ్యాయులు

సామర్లకోట: జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సామర్లకోట మండలం మాధవపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయిలో బహుమతులు సాధించారు. ఆదివారం కాకినాడ మూడో పోలీసు బెటాలియన్ క్రీడా మైదానంలో పోటీలు జరిగిన విషయం విదితమే. అండర్–14 విభాగం జావెలిన్ త్రోలో రామవరపు పవన్ ప్రథమ స్థానం, గణేష్ పెంకె హిమవర్ధిని ద్వితీయ స్థానం సాధించారు ట్రైఅథ్లెన్ (సైకిలింగ్, రన్నింగ్, స్విమింగ్) సీ విభాగంలో బొంగా సతీష్‌కుమార్ ప్రథమ, అనుసూరి హేమంత్ తృతీయ స్థానాలను సాధించారు. వీరు ఈ నెల 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో పాల్గొంటారని పాఠశాల పిజికల్ డైరెక్టరు గోవింద్ తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

భవన నిర్మాణ కార్మికురాలి మృతి



దుర్గ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబీకులు

కాకినాడ క్రైం: కాకినాడలో ఒక భవన నిర్మాణ కార్మికురాలు విధి నిర్వాహణలో ఉండగా ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయింది. వివరాలలోకి వెళితే.. నగరంలోని పర్లోవ పేటకు చెందిన రాగిటి దుర్గ (37) కుటుంబాన్ని పోషించేందుకు కొన్నాళ్లుగా భవన నిర్మాణ కార్మికురాలుగా పనిచేస్తోంది. కాకినాడ సాంబమూర్తి నగర్ మూడో వీధిలో ఒక అపార్ట్‌మెంట్ నిర్మాణం జరుగుతుండగా సోమవారం పనికి వెళ్లింది. నిర్మాణంలో ఉన్న మెట్లపై నుంచి నడుస్తూ ఇటుకలు కింది నుంచి మూడో అంతస్తుకు తరలిస్తుంది. ఈ క్రమంలో ఒక్కసారిగా కిందకు జారిపడి తల పగిలి అక్కడిక్కడే దుర్గ ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటనపై స్పందించిన బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్క్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ బృందం మృతురాలికి భవన యజమానితోపాటు ప్రభుత్వ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తరుపున కుటుంబానికి పది లక్షలు పరిహారం ప్రకటించాలన్నారు. దుర్గకు భర్త ముసలయ్య, కుమార్తె సత్యవేణి ఉన్నారు. ఈ ఘటనపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదుచేశారు.

పశువులకు టీకాలు

కొత్తపల్లి: గాలికుంటు వ్యాధి సోకిన పశువుల్లో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గడమే కాకుండా మృతి చెందడం కూడా జరుగుతుందని పశు వైద్యాధికారి హిమజ అన్నారు. స్థానికంగా జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా సోమవారం పశువులకు ఉచిత గాలి కుంటి వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని కొత్తపల్లి, నాగులపల్లి, కొమరగిరిలో ఉన్న పశు వైద్య కేంద్రాల పరిధిలో మూడు బృందాలుగా ఏర్పడి టీకాలు వేస్తున్నామన్నారు. మండలంలో ఉన్న 10,350 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఆరోగ్యంగా ఉండే నాలుగు నెలల వయసు పైబడిన అన్ని ఆవులు, గేదెలు తదితర పశువులకు ఈ టీకాలు వేస్తున్నామన్నారు. నాలుగు నుంచి 8 నెలల లేక దూడలకు నెల రోజుల వ్యవధిలో మరోసారి పోస్టర్ డోస్ వేయించుకుంటే వాటిలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు.